# అనుబంధం

పి. ఎ. పంతులు

మానవ జీవితంలో ఆకస్మికంగా కొన్ని అనూహ్యమైన సంఘటనలు జరుగుతూ వుంటాయి. ఆ సంఘటనలు జీవితంలో గొప్ప మార్పు తీసుకువస్తాయి. కష్టంతో మనశ్శాంతి లేకుండా ఉండే జీవితం, ఆనందమయంగా మారిపోవచ్చును. అది అంతా దైవసంకల్పం.

అది [illegible] రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం. హైదరాబాద్ పోయే జనతా పొగలు క్రక్కుతూ వచ్చి ప్లాట్‌ఫారమ్ మీద నిలబడింది. కుండపోతగా వర్షం పోరుస్తూ వుంది. ప్రయాణీకులు తడుస్తూ తొందరగా ట్రెయిన్ ఎక్కుతున్నారు. కొంతమంది కుర్రాళ్ళు వేడివేడి టీ కేటిల్స్‌తో వచ్చి 'గరమ్ చా' అని కేక వేస్తున్నారు. అప్పుడే వేయించిన వేరుసెనగకాయలు 'సీనాదానా' అని అమ్ముతున్నారు. పిల్లవాళ్ళు, ఆడవాళ్ళు వర్షంలోని [illegible] హుషారుగా ఉన్నారు. ట్రెయిన్ గార్డు



## అనుబంధం

> ఏ ఆధారమూ లేక గాలికి ఊగిసలాడుతున్న బ్రతుకు అతనిది. పైసాకు గతిలేదు. సిరిదా మోకాలు అడ్డినాడు; అన్యాయార్జితం ఇష్టం లేక. అదే బ్రతుకు వెలుగుబాట చూపే అనుబంధం అవుతుందని అతనికి తెలియదు; ఆమెకుమాత్రం ఏమి తెలుసు?

విజిల్ యివ్వగానే కదిలింది. ఇంతలో వేణుగోపాలరావు పరుగుపరుగున వచ్చి ట్రెయిన్ ఎక్కాడు. కంపార్ట్మెంటులో అడుగుపెట్టి చూశాడు. ముందువైపు సీట్లన్నీ నిండిపోయి వున్నాయి. ఇంకా లోపలికి పోయేసరికి ఒక పూర్తిసీటు ఖాళీగా ఉంది. దాని కెదురుగుండానే ఒక అమ్మాయి, బహుశా కాలేజీ గర్లేమో ప్రక్కకు తిరిగి గాఢ నిద్రలో వుంది. వేణు ఆ ఖాళీసీటుమీద కూర్చోవడమా? వద్దా?అని అనుకున్నాడు. 'ఈ జాగాలో కూర్చున్నవారు ఎక్కడికయినా వెళ్ళి ఉండవచ్చు. సరే ప్రస్తుతం కూర్చోవచ్చు. తర్వాత సంగతి చూద్దాం' అని పరుపు పెట్టె మీద పెట్టి కూర్చున్నాడు.

లాగు జేబులో ఉన్న వక్కపొడి పొట్లాం విప్పి నోట్లో వేసుకుని, 'కాబూలీశాండల్స్' విప్పి సీటు క్రిందకు త్రోశాడు. ఆ అమ్మాయి నిద్రిస్తూన్న సీటుక్రింద ఒక సిల్కు రుమాలుతో కట్టబడిన మూట కనుపించింది. వేణు దానిని యివతలకు లాగి, విప్పి చూశాడు. ఆశ్చర్యం! రూపాయలనోట్లు కట్టలు కట్టి వున్నాయి దానినిండా! ఇవి ఆ అమ్మాయివే అయివుండవచ్చుననుకున్నాడు వేణు. వేణుకు ఆ అమ్మాయి ఎవరో, ఎక్కడికి ప్రయాణం చేస్తూవుందో, తెలుసుకోవాలనే కుతూహలం హెచ్చింది. ఆమె ఒక దుప్పటి బుజాలవరకూ కప్పుకుంది. ముఖము అటుప్రక్కకు త్రిప్పుకొని గాఢ నిద్రలో ఉంది. ఎంతకూ నిద్రలేచే స్థితిలో లేదు.

ఇంతలో ట్రెయిన్ ఒక స్టేషన్లో ఆగింది. పదిమంది బిలబిలమంటూ చుట్టలు కాల్చుకుంటూ, నోటిలో ఖారాకిళ్లీలు బిగించి ప్రవేశించారు ఆ పెట్టెలోనికి. వేణు కూర్చున్న సీటువద్దకు వచ్చి బైఠాయించడం మొదలెట్టారు. వేణు వాళ్ళలో కొంతమందిని యింకొక పెట్టెలోనికి వెళ్ళ పొమ్మంటూ ఉన్నాడు. వాళ్ళు వినకుండా ఆ సీటంతా ఆక్రమించుకోడానికి ప్రయత్నిస్తూ వున్నారు. ఈ తోపులాట గోలకు ఆ అమ్మాయి నిద్ర పటాపంచలయి లేచి కూర్చుంది. వాళ్ళ మోటు ప్రవర్తనకు ఆశ్చర్యముతో నిల్చుని చూస్తూ ఉన్నాడు వేణు. ఇంతలో రైలు ఒక్కసారి వదలగానే వేణు తల బల్లకు ఢీకొట్టి ఆ అమ్మాయి ఒళ్లోపడ్డాడు.

వేణు తల పట్టుకుంటూ "ఎక్స్క్యూజ్ మి! నాజాగా ఈ మూర్ఖపు వెధవలు ఆక్రమించుకున్నారండీ" అని క్షమాపణ వేడుకున్నాడు.

ఆ అమ్మాయి 'సరే' అన్నట్లు అతని వైపు చూసింది. వేణుకు జాగా లేకపోవడం చేత నిల్చుండిపోయాడు. ఆ అమ్మాయి హోల్డాలు సగం మడిచి 'కూర్చోండి ఫరవాలేదు' అంది.

వేణు కూర్చుంటూ 'చాలా థాంక్స్!' అన్నాడు. కొన్ని క్షణాలు ఒకరివైపు యింకొకరు చూసుకొంటూ మౌనం వహించారు.

ఆమె వయసులో వున్న యువతి. ప్రతి అవయవంలోను సౌందర్యం లాస్యం చేస్తూఉంది. పూర్ణచంద్రుని పోలిన ముఖము, పాలబుగ్గలు ఆమె విగ్రహానికి మెరుగులు దిద్దుతున్నాయి. ఆమె విశాల నేత్రాలు అప్పుడే కొలనులో వికసించిన పద్మములవలె ఉన్నాయి.

'మీ రెంతవరకూ ప్రయాణం చేస్తున్నారు?' అన్నాడు వేణు.

'హైదరాబాద్' అన్నది ఆమె.

'ఆహా! నేనూ హైదరాబాదే వెళ్తున్నాను' అన్నాడు వేణు.

వేణు కొంచెం సంశయిస్తూ, 'యిదిగో ఏమండీ! మీ వస్తువు ఏదైనా పోయిందేమో ఒక్కసారి చూసుకోండి' అన్నాడు.

వెంటనే ఆ అమ్మాయి వేణువైపు ఆశ్చర్యంతో చూస్తూ, తలగడఎత్తి, 'అయ్యో! రుమాలు మూట ఏమైంది?' అని పరుపు దులపడం ఆరంభించింది.

"ఏమి రుమాలు మూటండీ" అన్నాడు వేణు కంగారుగా.

'ఐదువేల రూపాయలు మూట కట్టానండి సిల్కురుమాలుతో. తలగడ క్రింద పెట్టుకొని నిద్రపోయాను. ఎవరో కొట్టేశారు' అంది ఏడుపు ముఖంతో.

'విచారపడకండి! నేను రైలు ఎక్కగానే జోడు విప్పుకొని సీటు క్రిందకు త్రోశాను. అప్పుడు నాకు ఒక సిల్కు రుమాలు మూట మీ సీటు క్రింద కనిపించింది. అది తీసి ఉంచాను. ఇదిగో తీసుకోండి' అన్నాడు వేణు నిదానంగా.

ఆ అమ్మాయి వేణు యిచ్చిన మూట అందుకుంటూ, 'హమ్మయ్యా! మీకు చాలా ధన్యవాదాలండీ. మీరు మంచి హృదయం గలవారు కాబట్టే యింతడబ్బు చేతికి చిక్కినా తీసుకోకుండా యిచ్చివేశారు. మీవంటి నిజాయితీగల వ్యక్తులు ఈ కాలంలో ఉండరు' అన్నది.

'ఇది మానవ ధర్మమండీ! ప్రతి మానవుడూ మోసగాడైతే ప్రపంచమంతా ఏమవ్వాలి?' అన్నాడు వేణు.

ఆ అమ్మాయి వేణువైపు చూస్తూ అంది: 'ఈ రోజున మీరు నాకు చేసిన సహాయం జీవితంలో మరువలేను. మీ ఋణం....'

'అబ్బే! మీరల్లాగ ఏమీ అనుకోవద్దు! ఇదంతా దైవకృప.'

ఇంతలో విశాఖపట్నం స్టేషన్ వచ్చింది. వేణు తన సామాన్లు ఆ అమ్మాయికి అప్పగించి కాఫీ త్రాగడానికి వెళ్ళాడు.

వేణు తిరిగి వచ్చి కూర్చోగానే రైలు కదిలింది. వేణు దీర్ఘంగా ఆలోచనలో మునిగిపోయాడు. హైదరాబాద్ నగరం తనకు సరిక్రొత్త. ఉద్యోగం ఎన్నాళ్ళకు దొరుకుతుందో? తన దగ్గర ఉన్న కొంచెం డబ్బు ఉద్యోగం దొరికేవరకూ సరిపోతుందో, సరిపోదో?

ఇంతలో ఆ అమ్మాయి పిలుపుతో వేణు ఆలోచనాసాగరంనుండి బయటపడ్డాడు. 'మీ నాన్నగారు హైదరాబాద్‌లో పని చేస్తున్నారా?'

'లేదండీ! సుబ్బారావ్‌గారని హైకోర్టు ప్లీడరుగారు పటేలు స్ట్రీట్‌లో ఉన్నారట. ఆ మహాపట్టణంలో ఏదైనా ఉద్యోగం వేయించమని కోరడానికి ఆయన వద్దకు వెళ్తున్నాను.'

'మా యిల్లు పటేల్ స్ట్రీట్‌లోనే ఉంది. ఇద్దరం ఒక్క టాక్సీలోనే వెళ్ళవచ్చు.'

'చాలా థాంక్స్ అండీ! నాకు హైదరాబాద్ పరాయిదేశంలాంటిది. అందులోనూ యింతవరకూ మా బరంపురం తప్పితే, యింకొక వూరు వెళ్ళలేదు!'

ఆ అమ్మాయి కిలకిల నవ్వింది.

వేణుగోపాలరావు ఇంటర్ ఫస్ట్‌క్లాస్‌లో ప్యాసయ్యాడు. అతని పండ్రెండవ ఏట తల్లి తండ్రి ఒక్కమారే కలరా వ్యాధితో మృతి చెందారు. వేణు తల్లితండ్రులకు ఒక్కడే బిడ్డ. వేణు తండ్రి ఆఖరి శ్వాస విడిచే ముందు ఆయన ప్రాణస్నేహితుడయిన రాఘవయ్యగారనే స్కూలు మాస్టరుకు పదిహేను వందల రూపాయలిచ్చి, వేణుకు విద్యాబుద్ధులు చెప్పించమని వేడుకున్నాడు. వేణు తండ్రికి తన బంధువులమీద నమ్మకం లేకపోవడంచేత, రాఘవయ్యగారిమీద విశ్వాసం చేత వేణు మాస్టరుగారి యింట్లో పెరగవలసి వచ్చింది. రాఘవయ్యగారు వేణును తన పిల్లలతో సమానంగా చూస్తూ, ఇంటర్మీడియేట్ వరకు చదువు చెప్పించారు. అతి తెలివైనవాడు, బుద్ధిమంతుడు అయిన వేణుకు

# దీపావళి కథానికల పోటీ

ఆంధ్రప్రభ వారపత్రిక దీపావళి కథానికల పోటీలో ఈ దిగువ పేర్కొనిన విధంగా బహుమతులివ్వడానికి నిర్ణయించింది.

మొదటి బహుమానం రూ 500
రెండవ „ „ 300
మూడవ „ „ 200

నిబంధనలు :

1. కథలు మా కార్యాలయానికి ఆగస్టు 15 వ తేదీ లోగా అందవలెను.
2. కథ మా వారపత్రికలో మూడు పుటలకు మించి వుండరాదు.
3. కథ స్వంతమై వుండవలెను. ఇతర భాషల నుండి అనుసరణలు, అనుకరణలు ఆమోదింపబడవు.
4. పోటీలకు వచ్చిన కథలను వినియోగించుకునే హక్కు సంపాదకులదే. కథలు ఆంధ్రప్రభ వారపత్రిక సొత్తుగానే పరిగణింపబడుతవి. కాని, వాటినుండి ఎన్నుకొనబడి, వారపత్రికలో ప్రచురించిన కథలకు, మామూలు పద్ధతిలో పారితోషికములు ఇవ్వబడును.

—ఎడిటర్.




## పూవు మీ అదృష్టం చెప్పగలదు

భవిష్యత్తులో ఏమి జరగబోతున్నదిన్నీ, మీ సరియైన చర్యను గురించిన్ని మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన మీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయుతేదీ, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి మీరు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోని మీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారముల మీకు జయము కలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థ యాత్రలు, వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధి నిక్షేపములు, లాటరీ, అకస్మాత్తు ద్రవ్య లాభము మొదలగువానిని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు 1—25 లకు మాత్రము వి. పి. గా పంపగలము. వి. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్టగ్రహము లేమైనా వున్నయెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచి పైన పంపబడును. మేము పంపిన ఫోకటు మీకు తృప్తిగా నుండని యెడల పైకం వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (AV-3) Jullundur City


# అనుబంధం

పెద్ద చదువు చెప్పిస్తే బాగా రాణిస్తాడని రాఘవయ్యగారికి ఆలోచన [illegible]కపోలేదు. వేణు తండ్రి యిచ్చిన డబ్బు ఇంటర్మీడియేట్ వరకూ సరిగ్గా ఖర్చయిపోయింది. పోనీ తను ఏమైనా సహాయం చేద్దామంటే సంసారపు యిబ్బందులచే ఆ ఆలోచన కార్యరూపంలో పెట్టలేదు. వేణు టైపురైటింగ్ 'లోయర్ గ్రేడ్' ప్యాసయ్యాడు. అందుచేత రాఘవయ్యగారు హైదరాబాద్‌లో తన స్నేహితుడైన హైకోర్టు ప్లీడరు సుబ్బారావ్ గారికి వేణుకు ఏదైనా ఉద్యోగం వేయించమని ఉత్తరం వ్రాశాడు. ఆ ఉద్యోగం దొరికిన తరువాత నైట్ కాలేజీలో ప్రవేశించి బి. ఎస్‌సి. ప్యాసవుదామని వేణు ఆలోచన.

హైదరాబాద్ స్టేషన్ వచ్చింది. ఆ యువతీ యువకులు ఇద్దరూ సామాన్లను పరస్పర సహాయంతో దింపుకుంటూ ప్లాట్‌ఫారం మీద అడుగుపెట్టారు. అనుకున్నట్లుగా ఒకే టాక్సీలో బయలుదేరివారు. టాక్సీ 'శారదా భవన్' అను ఒక అందమైన డాబా యింటి ముందు ఆగింది. చిన్న కాంపౌండు; ఆ కాంపౌండు లోపల చిన్న పువ్వుల తోట. గేటు వద్ద నాలుగు పోకచెట్లు స్తంభాలవలెరమ్యంగాకనబడుతున్నాయి. సూర్యకాంతం పూవులు అప్పుడే ఉదయిస్తూన్న సూర్యుని పలకరిస్తున్నట్లు తలలు కదలిస్తున్నాయి. ఎర్ర గులాబి పూవుల మీద మంచు బిందువులు ముత్యాలలాగ మెరుస్తున్నాయి. రాత్రంతా కుసుమ పరిమళం వెదజల్లిన 'నైట్ క్వీన్' వాసన ఆ తోటలో యింకా మిగిలివుంది. రంగు రంగుల క్రోటన్స్ చెట్లు బాలభానుని లేత కిరణాల్లో యింకా అందంగా కనిపిస్తున్నాయి, విశాలమైన గదులు, ఆ గదుల నిండా అందమైన 'ఫర్నీచర్'తో ఆ యిల్లు చూడ ముచ్చటగా ఉంది. వేణు ఆ యింటిని చూస్తూ ప్రపంచాన్నే మరిచిపోయాడు.

శారద కాఫీ తెచ్చి వేణు ముందు వుంచుతూ, 'రేడియో పెట్టుకోండి. కాలక్షేపం అవుతుంది. వేడినీళ్లు కాగుతున్నాయి. స్నానమయ్యాక ప్లీడరుగారి యింటికి వెళ్లవచ్చును. నాలుగు రోజులై యిల్లు తాళం వేసివుండటంచేత, ధూళి నిండిపోయింది. అన్నీ 'నీటు'గా చేయించి వస్తాను' అన్నది మృదు మధుర కంఠంతో.

వేణు కుర్చీలో నుండి లేస్తూ, 'మీరు నా గురించి ఏమీ శ్రమపడకండి! ఏదైనా లాడ్జి చూచుకుంటాను యిప్పుడే వెళ్లి' అన్నాడు.

'తొందరపడకండి! నేను మీకు లాడ్జి ఏర్పాటు చేయిస్తాను. 'గాంధి నగర్' లో మా మేడ ఒకటి వుంది. దాంట్లో ఒక గది మీకు యిప్పిస్తాను. తర్వాత అన్ని సంగతులు తీరుబాటుగా

మాట్లాడు కొందాం' అని శారద లోపలికి వెళ్లిపోయింది.

వేణుకు శారద పరిచయం ఎంతో ధైర్యం, ఉత్సాహం యిచ్చాయి. మొదట వేణుకు హైదరాబాద్ ప్రయాణమంటే, ఒకవైపు ఉత్సాహం, భయమూ కలిగినవి. ఆ మహానగరంలో తను ఎల్లా వుండగలడో అన్న అనుమానం పీడించింది. కాని శారద పరిచయం పేదవానికి పెన్నిధి వలె లభ్యమయింది.

శారద పెట్టిన ఇడ్లీ, కాఫీ పూర్తిచేసి ప్లీడరుగారి యింటి వైపు బయలుదేరాడు వేణు. భోజనానికి వేగంగా వచ్చేయమని శారద వీధిగుమ్మం వరకు వచ్చి చెప్పింది. 'అనుకున్న దొకటి, అయినది వేరొకటి' అన్నట్లు, తీరా ప్లీడరుగారింటికి వెళ్ళితే యిల్లు తాళం వేసి వుంది. ఆయన ఢిల్లీ వెళ్లారనీ, వచ్చేసరికి సుమారు నెల అవుతుందనీ నౌకరు వేణుతో చెప్పాడు. ఆ మాట వినగానే వేణుకు మతి పోయినట్లయింది. 'ఆయన వచ్చేవరకు వేచి వుండాలి. వచ్చిన తరువాత ఉద్యోగంకోసం యింకెన్ని దినాలు వేచివుండాలో! శారదతో ఇంతో అంతో పరిచయం లభించినప్పటికీ ఎక్కువ దినాలు అక్కడ వుండడమూ బాగుండదు. ఆమె తల్లి తండ్రులు బహుశా ఏ వూరైనా వెళ్లి వుంటారు. నన్ను యింట్లో వుంచినందుకు ఆమెకు చీవాట్లు, చెప్పుదెబ్బలు అవుతాయి! శారద వాళ్ల మేడమీద ఒక గది యిప్పిస్తానంది. కాని వున్నవి రూ. 75 లు. ఉద్యోగం దొరికే వరకూ కాలక్షేపం చేయడం కష్టం అవుతుందేమో!' ఈ విధంగా ఆలోచించుకొంటూ 'శారదాభవన్' చేరాడు వేణు.

శారదకు క్రిస్మస్ సెలవులు. అందుచేత కాలేజీకి పోలేదు. వేణు వెంటనే తిరిగిరావడం చూచి, శారద సావిట్లోకి వచ్చి, చిన్నపోయిన ముఖంతో కూర్చున్న వేణువైపు ఆశ్చర్యంగా చూచింది.

'ఇల్లు తెలియలేదా?' అంది శారద.

'ప్లీడరుగారు ఢిల్లీ వెళ్లారట. వచ్చేసరికి సుమారు నెల అవుతుందిట. సాయంత్రం మీరు 'లాడ్జి' చూపిస్తే అందులోకి వెళ్లిపోతాను.'

శారద కొన్ని నిమిషాలు మౌనం వహించి, 'పోనీ ప్లీడరుగారు వచ్చే వరకు మా యింట్లో గడపండి. అనవసరంగా ఈ నెల హోటల్‌కి ఖర్చుచేయడ మెందుకు?' అన్నది.

వేణు ఆమెవైపు ఆశ్చర్యంగా చూస్తూ, 'మిమ్మల్ని అనవసరంగా శ్రమ పెట్టడం నా కిష్టంలేదు. ఏదైనా సహాయం అవసరం వచ్చినపుడు అడుగుతాను' అన్నాడు.

'శ్రమకేముందండీ! నేను ప్రత్యేకంగా మీ కోసం వంటచేయ నవసరంలేదు. మా వంటామె ఉంది. ఫరవాలేదు. నేను చెప్పినట్లు చేయండి. మీ మంచికోసమే చెప్తున్నాను.'

'మీరు నా సౌఖ్యం విషయం ఆలోచించారు కాని, మరి మీ విషయం ఏ మైనా ఆలోచించారా? మీ తల్లితండ్రులొస్తే మిమ్మల్ని కోప్పడరా?'

శారద విచార వదనంతో, 'నాకు తల్లి తండ్రులు లేరు. నన్ను ఈ లోకంలో ఒంటరిగా విడిచి పరలోకగతులయ్యారు. ఇప్పుడు నేను సర్వ స్వతంత్రురాలిని' అన్నది.

ఆమె కనులలో నీరు నిండింది.

సోఫాకు చేరబడి వున్న వేణు చివాలున ముందుకు వంగి అన్నాడు: 'అయ్యో పాపం! అంతా దైవానుగ్రహం! నేనూ మీలాగనే చిన్నతనంలోనే తల్లితండ్రుల్ని కోల్పోయిన దురదృష్టవంతుణ్ణి.' వేణు ముఖంలో విచార రేఖలు అలముకున్నాయి.

* * * *

శారద తండ్రి రామారావుగారు జిల్లాజడ్జిగా పనిచేసేవారు. ఆయన భార్య టైఫాయిడ్ జ్వరంతో ఆకస్మికంగా మరణించింది. ఒక్కగా నొక్కబిడ్డ శారదను అల్లారుముద్దుగా పెంచుతూ, ఆమెనే ఆశాజ్యోతిగా తలుస్తూ ఆ విచార దినాలు గడిపేవారు జడ్జీగారు. రామారావుగారు 'రిటైర్' అవ్వగానే హైదరాబాద్ నగరంలో ఒక మేడయిల్లు, డాబాయిల్లు కట్టించుకుని స్థిరపడిపోయారు. శారద కాలేజీలో చేరి శ్రద్ధగా చదువుకుంటూ వుంది. రామారావుగారు శారద తెలివితేటలను చూసి, తనకు కుమారుడు లేడన్న లోటు ఆమె తీరుస్తుందని ముచ్చటపడేవారు.

ఒక రోజున శారద కాలేజీనుండి వచ్చేసరికి, తండ్రి మంచం మీద పడుకుని మూలుగుతున్నాడు. డాక్టర్ ప్రకాశరావు రామారావుగారికి యింజక్షన్ ఎక్కిస్తున్నాడు. డాక్టర్ ప్రకాశరావుగారు, రామారావుగారు ప్రాణస్నేహితులు. రామారావుగారు ఆయాసంతో, 'ప్రకాశ్! శారద పేర వీలునామా వ్రాసి వుంచాను. రిజిస్ట్రార్ గారికి ఫోనుచేసి వెంటనే రప్పించు. ఎందుకైనా మంచిది' అన్నారు.

శారద ఏడుస్తూ, 'అవేం మాటలు నాన్నా! ఫరవాలేదు నీ ఒంట్లో కులాసాగా ఉంటుంది' అంది.

డాక్టర్‌గారు ధైర్యంచెప్తూ, 'ఫరవాలేదు రామం! ధైర్యంగా వుండు. నేను ఈ రోజంతా నీ దగ్గరే ఉంటాగా' అన్నారు. గుండె నీరసించడం చేత యిది ప్రమాదమే అని డాక్టర్ ప్రకాశ్ అర్థం చేసుకొని, రిజిస్ట్రార్‌ను వెంటనే రప్పించాడు.

శారద భోజనం కూడా మానుకుని తండ్రి ప్రక్కనే వాడిపోయిన ముఖంతో కూర్చుంది. అర్ధరాత్రయింది. రామారావుగారికి ఆయాస మెక్కువయింది.

రామారావుగారు హీనస్వరంతో, 'ప్రకాశ్! అప్పుడప్పుడు వచ్చి శారద యోగక్షేమాలు కను





దొంగల బారినుండి అడవి జంతువుల నుండి మిమ్ము మీరే కాపాడుకోండి. యాత్రికులకు,వన భోజనాలకు, డ్రామాలకు ఉపయోగకరం. తేలికైన 6 గుండ్ల ఆటోమేటిక్ రివాల్వరు. దాని రవ్వలు కన్నులకు మిరుమిట్లు గొల్పును.

777 888 999

రు 8/- రు 10/- రు 15/-

25 తోటాలు ఉచితం

అదనంగా 100 తోటాలు రు 5- తోలు సంచి రు 6- లైసెన్సు అవసరంలేదు

పోస్టేజి రు 2- అదనం

INDIAN CHAMBER OF SCIENCE.
(P-A.P.W.), Jullundur City.

స్థాపితం 1920
రెడ్డి అండ్ కో., (రిజిస్టర్డు)
గోపాలపురం, తూ. గో. జిల్లా
కుష్ఠు బొల్లి మేహశాడ
వగైరా చర్మ సుఖ వ్యాధులకు ప్రత్యేక చికిత్స.
శాస్త్రీయ -
ఆయుర్వేద ఔషధములు లభించును
→ కేటలాగు సలహా ఉచితము

సినిమానటులు

మీరు సినీతారలుగాచేరి, నెలకు మంచివరుమానం పొందవలెనన్నచో నేడే మాకు వ్రాయండి. ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషు లేక హిందీలో వ్రాయవలెను.

BOMBAY FILM SERVICE
(W.A.P.) Phagwara (N.R.)

క్కుంటూ ఉండు. శారద బుద్ధిగా ఉండి నా పేరు నిలబెడుతుందని నాకు ధైర్యముంది' అన్నారు.

ప్రకాశరావు కండ్లలో నీరు నిండింది. 'శారదకు ఏ ఆపదా రాకుండా చూస్తాను రావుఃం' అన్నాడు గద్గదస్వరంతో.

శారద కళ్లనుండి ధారలు ప్రవహిస్తున్నాయి. రామారావుగారు శారద తల నిమురుతూ, 'అమ్మా శారదా! బుద్ధిగా ఉంటావుకదూ! బంధువులను మాత్రం చేరనీయకు. డబ్బున్నప్పుడే బంధువులు చేరుతారు. మంచి విద్యావంతుణ్ణి, ఆదర్శమయిన యువకుణ్ణి వివాహం చేసుకో!' అన్నారు.

'నాన్నా! నేను ఎల్లా జీవించేది నాన్నా! నన్ను ఒంటరిగా విడిచి వెళ్లిపోతావా? నేనూ వచ్చేస్తాను నీతో!' అని ఏడవ నారంభించింది.

# అనుబంధం

రెపరెపలాడుతున్న ఆయన జీవనజ్యోతి ఆరిపోయి ఆ గదిలో చీకటి అలముకుంది. ఆ గాఢాంధకారంలో శారద గుండెలు బాదుకుంటూ ఉంది.

* * * *

ఇప్పుడు శారద స్వతంత్రురాలు. హైద్రాబాద్ వచ్చినప్పటినుండీ రామారావుగార్ని కనిపెట్టుకుంటూ ఉన్న నౌకరు గంగన్న, సీతమ్మగారనే వంటావిడ శారదకు ఆయింట్లో ఆసరాగా ఉంటున్నారు. శారద తన తండ్రి కారును అద్దెకిచ్చివేసింది. పెద్ద మేడవలన శారదకు నెలకు మూడు వందల రూపాయలు అద్దెలు వస్తూవుంటాయి.

శారద స్నేహితురాండ్రు తరచు శారద ఇంటికి వచ్చి, ఆమెతో కొంతసేపు కాలక్షేపం చేసిపోతూ వుం ారు. రాత్రిళ్లు డాక్టర్ ప్రకాశరావుగారి అమ్మాయి వచ్చి శారదతో కలిసి చదువుకుంటూ ఉ॥ంది. రామారావుగారికి కటక్‌లో ఒక చిన్న ఇల్లు వుంది. కాని ఆ ఇంటి అద్దె సరిగ్గా వసూలు అవ్వకపోతూ వుండటంచేత, దానిని అమ్మివేయాలని అనుకున్నారు. కాని, ఆయన ఆకస్మిక మరణంవలన ఆ పని ఆగిపోయింది. ఆ తర్వాత శారదకు క్రిష్టమస్ సెలవులు ఇవ్వగానే ఆ ఇంటిని అమ్మివేయడానికి 'కటక్' వెళ్లింది. శారట తొందరగా ఆ వ్యవహారం పరిష్కారం చేసుకుని ఐదు వేల రూపాయలు పట్టుకుని రైలెక్కింది. ఈ తిరుగుప్రయాణంలోనే ఆ రూపాయలు రైలుబండిలో ఆమె అదృష్టవశాత్తు సహృదయుడైన వేణుకు దొరకడం, తిరిగి ఆమె చేతికి రావడం జరిగింది.

వారం దినములు దొర్లిపోయాయి. వేణూ శారదల పరిచయం కూడా అభివృద్ధి చెందింది. శారద వేణు జీవితచరిత్ర అంతా తెలుసుకుని చాలా విచారించింది. అంత తెలివి గల యువకునివైపు ధనలక్ష్మి చిన్నచూపు చూడకుండావుంటే పెద్ద చదువు చదివి వుండునుగదా ! డబ్బున్నవారికి విద్యబ్బదు. విద్యాకాంక్ష గలవారికి డబ్బుండదు ! శారదకు వేణుమీద జాలి కలిగింది. వేణుకు తను ఎందుకు సహాయపడి విద్య చెప్పించకూడదు ? తనను కాదనేవారెవరు ? అటువంటి ఆదర్శ యువకునికి విద్య చెప్పిస్తే, తను జీవితంలో ఒక ఘనకార్యం చేసినదవుతుంది. వేణు బై. పి. సి. గ్రూప్‌తో ఇంటర్ ఫస్ట్ క్లాస్‌లో ప్యాసయ్యాడు. అందుచేత ఎం. బి., బి. ఎస్. లో సులభంగా సీటు దొరుకుతుంది. ఈ విధంగా శారద ఒక నిశ్చయానికి వచ్చి, వేణుకు తెలియపరచింది.

వేణు ఆనందం చెప్పనలవిగాదు. గుమాస్తా ఉద్యోగం సంపాదించుకుందుకు వచ్చిన తనకు దైవము ఒక చక్కని పూలబాట చూపించినందుకు ఉప్పొంగిపోయాడు. డాక్టర్ ప్రకాశరావుగారు వేణు విషయమై మొదట వ్యతిరేకించినా, శారద నచ్చజెప్పిన తర్వాత, వేణు నడవడి చూసి, శారద మంచిపనే చేసిందని తృప్తిపడ్డారు.

వేసవిసెలవులు అయిన తర్వాత వేణు మెడికల్ కాలేజీలో చేరాడు. తన తండ్రి చనిపోయిన తర్వాత శారదకు ఆ ఇంట్లో వుండడానికి నిరుత్సాహముగాను, అధైర్యముగాను వుండేది. ఎందుచేతనో వేణు వచ్చినప్పటినుండి శారదకు నూతనోత్సాహము



వచ్చింది. లోకులు ఎవరో ముక్కూ మొగము తెలియని పురుషుణ్ణి ఇంటిలో పెట్టుకుందని శారదను ఆక్షేపించకపోలేదు. కాని శారద వారి మాటలు లక్ష్యపెట్టలేదు. ఒకసారి శారదతో వేణు అన్నాడు: 'శారదా ! నా కోసం నీవు లోకులచేత నిందపడడం బాధగా వుంది. అందుచేత ఇంకెక్కడయినా వుండి చదువు సాగిస్తే మంచిదేమో !'

'వేణూ ! లోకులకు లొంగివుంటే మనం జీవితంలో ఏ కార్యమూ చేయలేము. ఈ లోకులకు చెవులున్నాయి గాని, కళ్లు లేవు. అందుచేత నీవు ఈ సంస్కర్తలకు భయపడి మనస్సు పాడుచేసుకోకు !' అంది శారద శాంతంగా.

* * * *

వేణు 'శారదా భవన్' లో ప్రశాంత జీవితం గడుపుతున్నాడు. ఎక్కువకాలం చదువు లోనే లీనమయిపోయేవాడు. శారద తనకు ఏమైనా తెలియకపోతే వేణువద్ద నేర్చుకునేది. కాలేజీలో ఏ పనైనా వుండి శారద రావడం ఆలస్యమైతే వేణుకు ఏమీ తోచేది గాదు. వేణు భోజనానికి రావడం ఆలస్యమైతే శారద అతనికోసం కనిపెట్టుకుని వుండేది.

ఈ ఉజ్జ్వల జీవితానికి దారి చూపిన రాఘవయ్యగార్నిమాత్రం వేణు మరచిపోలేదు. తరచూ ఆయనకు ఉత్తరాలు వ్రాస్తూ వుండేవాడు. ఒక్కసారి శారద, 'గాబర్డీను' పంట్లాములు కుట్టించుకోమని వేణుకు నూరు రూపాయల నోటు ఇచ్చింది. కాని వేణు ఆ నూరు రూపాయలు రాఘవయ్య గారికి, పిల్లలందరికి బట్టలు కుట్టించమని మనియార్డరు చేశాడు. ఆ సంగతి శారద తెలుసుకుని వేణును షాప్‌కు తీసుకుని వెళ్లి రెండు 'గాబర్డీను' పంట్లాములు కొని ఇచ్చింది.

శారదకూడా ఇంటర్మీడియట్ ప్యాసయి ఎం. బి., బి. ఎస్. లో చేరింది. అంటే వేణు శారదకన్న ఒక సంవత్సరం సీనియర్. నాలుగు సంవత్సరాలు ప్రశాంతంగా గడిచి పోయాయి. ఒకనాడు వేణు 'ఎం. బి. బి., ఎస్.' ఫస్ట్‌క్లాస్‌లో ప్యాసయినట్లు పేపర్లో పడింది. శారద ఆనందసముద్రములో మునిగిపోయింది. స్నేహితులందరూ టీపార్టీ ఇస్తేగాని వీల్లేదని పట్టుపట్టితే టీపార్టీ ఏర్పాటుచేసింది శారద. 'ఫ్రెండ్స్' అందరూ శారద వేణుకు చేసిన సహాయం ప్రశంసించారు. పార్టీ ముగిసినతర్వాత వేణు బట్టలు మార్చుకుని నీటుగా ముస్తాబయి వచ్చాడు. వేణు ముస్తాబవ్వడం చూసి, శారదకూడా తొందరగా 'టాయిలెట్' అయి వచ్చింది. వేణు సమీపంగా నిలబడి, 'ఏం వేణూ ! ఇన్నాళ్లూ ఎక్కడికైనా వెళ్దామంటే మెల్లగా తప్పించుకునే వాడివి. జ్ఞాపకం వుందా ? ఇవ్వాళ నాతో షికారు రావలిసిందే !' అంది.

వేణు చిరునవ్వు నవ్వుతూ, 'దానికేముంది ! అట్లాగే వస్తానుగా !' అన్నాడు.

ఇంతలో టాక్సీ రాగానే ఇద్దరూ కూర్చున్నారు. శారద డ్రయివర్‌తో, 'సాలార్‌జంగ్ మ్యూజియం' వైపు పోనివ్వమంది.

ఆనాడు ఎందుచేతనో ఆ యువతీ యువకుల హృదయాలలో మధురభావనలు చెలరేగుతున్నాయి. శారద వేణువైపు తీయగా చూస్తే, వేణు చిరునవ్వుతో తలవాల్చేసుకుంటున్నాడు. వేణు ఆమె వైపు చూస్తే, ఆమె నవ్వుతూ తలవాల్చేస్తున్నది. వారిద్దరి హృదయాల్లో ఏవో భావాలు దాగొని బయటకు రాలేకపోతున్నాయి.

'శారదా ! గుమాస్తానవవలసిన నన్ను డాక్టర్‌గా చేసినందుకు నీ ఋణం తీర్చుకోలేను. లోకులకు భయపడకుండా పూర్వాపేర్లూ తెలియని ఒక క్రొత్త యువకునికి ఇంట్లో ఆశ్రయమిచ్చి, ఆదరించిన నీవంటి సాహసురాలు నేటి ప్రపంచంలో వుండదు' అన్నాడు వేణు రిస్టువాచీ సవరించుకుంటూ.

'వేణూ ! ఈ అనుబంధం దైవికంగా జరిగింది. నా గొప్ప ఏమిటుంది చెప్పు' అంది చీర చెంగు ముడిపెడుతూ.

'శారదా ! . .' అని వేణు ఆమె వైపు చూసి మౌనం వహించాడు.

శారద 'ఊ !' అని వేణు వైపు ఆశగా చూసింది.



'శారదా ! మన ఈనాటి అనుబంధం, శాశ్వత బంధంగా రూపొందాలని తలుస్తున్నాను.'

శారద ఆనందబాష్పాలు రాలుస్తూ, 'నాకు అంతకంటె కావలసిందేముంది వేణూ ! మా నాన్నగారి కోరిక ప్రకారం నీ వంటి ఆదర్శయువకుడు నా జీవిత భాగస్వామిగా లభించినందుకు ఆ భగవంతునికి నా నమస్కారా లర్పిస్తున్నాను' అన్నది.

ఇంతలో కారు పెద్ద మలుపు తిరగగానే, శారద వేణు భుజంమీద వాలిపోయింది. వేణు ఆమెను తన హృదయానికి హత్తుకున్నాడు.

శారద, వేణు ఇంటికి చేరేసరికి రాత్రి ఎనిమిది గంటలయింది. హాలులో కూర్చున్న డాక్టర్ ప్రకాశరావుగారు, 'కంగ్రాట్యులేషన్స్ వేణూ ! నువ్వు ఫస్ట్‌క్లాసులో ప్యాసయ్యావని తెలిసింది' అన్నారు.

'అమ్మా శారదా ! మా అమ్మాయి శశి వివాహం వచ్చేనెల చేస్తున్నాను. ఆ లగ్నానికే నువ్వూ వేణూ కూడా మధుపర్కాలు కట్టుకుని పెండ్లిపీటలమీద కూర్చోవాలి. ఇప్పటికే ఆలస్యమయింది. 'శుభస్య శీఘ్రం' అన్నారు పెద్దలు' అని ప్రకాశరావుగారు సోఫాలో నుండి లేచారు.

ఆ యువతీయువకు లిద్దరూ ఒకరి కండ్లలోనికి ఇంకొకరు చూసుకుని తలలు వాల్చేసుకున్నారు.

వేణు 'ఉస్మానియా హాస్పిటల్'లో హౌస్ సర్జన్‌గా వుండగా శారదకూడా ఎం. బి., బి. ఎస్. లో కృతార్థురాలయింది.

ఒకనాడు హైద్రాబాద్ నగరంలో 'శారదా క్లినిక్ అండ్ నర్సింగ్‌హోమ్' అను ఒక ప్రయివేటు హాస్పిటల్ వెలిసింది. బోర్డుమీద డాక్టర్ పి. వేణుగోపాలరావు ఎం. బి., బి. ఎస్., డాక్టర్ సి. శారద ఎం. బి., బి. ఎస్. అను జంటపేర్లు లోకాని కేదో దివ్య సందేశ మందజేస్తున్నాయి. ★